# ఆచార్య దేవోభవ !

—సూర్య ప్రసాదరావు

"మాస్టారూ..."

తలుపుపై గట్టిగా శబ్దం చేయబోయి... భాస్కర్ ఆగి పోయాడు... లోపలనుంచి సంభాషణ వినిపిస్తోంది.

"ఇంట్లో అన్ని వస్తువులు నిండుకున్నాయండీ!"

"తెద్దాం..."

"పాలవాడు డబ్బులకోసం మూడు రోజుల నుంచీ ఒకటే వేధిస్తున్నాడు"

"ఇద్దాం..."


"పాపకు రెండు రోజులనుంచి 103 డిగ్రీల జ్వరం"

"చూపిద్దాం..."

"చూపిద్దాం... కాదండీ ...డాక్టరుకు చూపించాను. రక్త పరీక్షలు చేయించాలన్నాడు... ఏదో తాత్కాలికంగా మందులిచ్చి..."

"చేయించుదాం"

"తెద్దాం...ఇద్దాం ...చూపిద్దాం ... చేయించుదాం అంటారే గానీ ... క్రియ మాత్రం శూన్యం...."




"నన్నే చేయమంటావే? అడగని వాడు లేడు ఇవ్వని వాడు తప్ప!"

"డబ్బు లేదని ఇవ్వవలసిన వాళ్ళు ఆగుతారా. రమ్మనకుండా వచ్చే రోగాలు ఆగుతాయా!"

"ఆగవు. పోనీ ఆపించే వస్తు వేదయినా వుందా... నీదగ్గర?"

"ఆ... ఉంది... ఇదొక్కటే! మంగళ సూత్రాలు ... పసుపు కొమ్ము కట్టుకొని అదీ తెచ్చి యిస్తాను... ఎక్కడైనా కుదువ బెట్టండి"

"ఇప్పటికీ కుదువ బెట్టింది చాలుగానీ... వాటికి వడ్డీ కూడా కట్ట లేకుండా ఉన్నా ... వీటిని అమ్మేస్తాలే... తరువాత చేయించుకోవచ్చు".

"సరే! మీ ఇష్టం... ఓ అయిదు నిమిషాల్లో వస్తా?"

"మాస్టారు!" ఈసారి భాస్కర్ కొంచెం గట్టిగా పిలిచాడు.

"ఎవరూ?" రామనాథం మాస్టారు తలుపు తీశారు.

"నమస్తే... మాస్టారూ?"

"నువ్వటయ్యా... భాస్కర్... రావయ్యా"

గుమ్మం బయటే చెప్పులు విడిచి భాస్కర్ లోపలికి వెళ్ళాడు.

"ఏమయ్యా... సబ్జెక్టులో సందేహా లేమయినా ఉన్నాయా"ఆకలెరిగిన అమ్మ ఆప్యాయంగా అడిగినట్లుంది.

"అవును మాస్టారూ? రెండుమూడు చాప్టర్లు చాలా కష్టంగా ఉన్నాయి. సిలబస్‌లు పూర్తి కాలేదు. ఈ లోపు మీరు స్ట్రైక్ మొదలెట్టారు. ట్యూషన్‌కు వెళ్ళే ఆర్థిక స్తోమత లేదు. అందుకని... ఎక్స్‌ప్లెయిన్ చేస్తారని ..." భాస్కర్ నీళ్ళు నమిలాడు.

"తప్పకుండా! నీ ఒక్కడి కేనా... ఇంకా ఎవరైనా ఉన్నారా?"

"నలుగురైదుగురు ఉంటారు మాస్టారూ?"

"అయితే ...వాళ్ళను కూడా రమ్మనమని చెప్పు ...ఉదయం... ఆరు నుంచి ఏడు గంటల మధ్యయితే మంచిది! తర్వాత నేను ఎప్పుడు ఎక్కడ ఉంటానో... ఈ స్ట్రైక్ పీరియడ్‌లో..."

"తప్పకుండా వస్తాము మాస్టారూ? థాంక్స్ సర్!"

నా వృత్తికి నాకు థాంక్స్ ఎందుకు బాబూ! రేపటి నుంచి రండి"

"మీ సమ్మెకు విరుద్ధం కాదు గదా... మాస్టారూ..."

భాస్కర్ నసిగాడు. "ఫరవాలేదు. నేనేమీ ట్యూషన్‌చెప్పడం లేదుగా... అయినా ఓ పాలసీ కోసం చేసే సమ్మె... మి భవిష్యత్తుకు భంగం కలిగించకూడదు" "వస్తాను మాస్టారూ!" భాస్కర్ బయలుదేరాడు... అదే భాస్కర్ .. వరాత్పరరావు మాస్టారిని అడిగితే "మీకు సిలబస్‌లుపూర్తి చేయడానికటయ్యా. మేం స్ట్రైక్ చేసేది... మా డిమాండ్స్ నెరవేరాలి. మీ సిలబస్‌లు పూర్తిచేస్తే మా సమ్మె ప్రభావం ఉంటుందా..."

"నిజమేనర్? ఉండదు"

"ఉండదు... కనుకనే సిలబస్‌లుపూర్తి చేయం. సమ్మె తేలిన తరువాతే మీ క్లాసులు తీసుకునేది"

"సమ్మె తేలిన వెంటనే పరీక్షలు మొదలౌతాయంటున్నారు..." భాస్కర్‌నసిగాడు.

"ఏమో! నేనెలా చెప్పగలను?"

"అందుకనే సర్? మీ దగ్గరున్న బ్యాచీలలో ఏదో ఓ బ్యాచీలో కూర్చుంటాను" చల్ల కొచ్చి ముంతదాచడం భాస్కర్‌కు ఇష్టం లేకపోయింది.

"వీలు పడదయ్యా! వాళ్ళకు చివరి టాపిక్ కవర్ చేస్తున్నాను"

"పోనీ... ఆ టాపిక్ అయినా వింటాను సార్!" ఆర్థిక అసహాయత భాస్కర్ చేత ఆ మాట అనిపించింది.

"అసలే రూం చిన్నదయ్యా... బ్యాచీవాళ్ళకే చోటు చాలడం లేదు. ఒకరి ఒళ్ళో ఒకరు కూర్చోవలసి వస్తోంది. మళ్ళీ ఎప్పుడైనా కలు"

భాస్కర్ జవాబివ్వాల్సిన అవసరం లేకుండా పరాత్పరరావు లోపలకు వెళ్ళిపోయాడు. అదే రామనాథం మాస్టారు.. మర్నాడు ఉదయం... ఆరు గంటలకు...

"నమస్కారం మాస్టారూ"

ఐదారుగురితో వచ్చిన భాస్కర్‌ను చిరునవ్వుతో రిసీవ్ సుకున్నారు.

"మాస్టారూ? ఇంకా సిలబస్ ఎంత వుందో... క్వశ్చన్ పేపర్ మోడల్స్ ఎలా ఉంటాయో మాకర్థం కావడం లేదు. ముందు వాటి గురించి చెప్తే... మా వీక్ చాప్టర్స్ చెపుతాం సార్!"

సిలబస్ కాగితాలు, క్వశ్చన్ పేపర్లు వాళ్ళ చేతి కందించారు.

మొట్టమొదటి చాప్టర్ నుంచి సంక్షిప్తంగా విషయాన్ని వివరించటం మొదలు పెట్టారు... యుగాలు క్షణాలౌతున్నాయి.

ఇంతలో...

"మాస్టారూ! మనం కాలేజీకి వెళ్ళె టైమయ్యింది. పికెటింగ్ ఉంది కదూ?" బయలుదేరాలి కేక!

అర్రర్రే..అప్పుడే ఎడున్నరయిపోయింది. ఇవ్వాల్టికి చాలు. రేపు కలుద్దాం...' మాస్టారు లేచారు.

కాలేజీ గేటు ముందు రామనాధం మాస్టారు...మరో పది మంది లెక్చరర్లు... అడిగారు.

"అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి" రామనాథం మొదటి నినాదాం ఇచ్చారు.

"అధ్యాపకుల ఐక్యత వర్ధిల్లాలి"

అధ్యాపకులు నిర్వహించని పరీక్షలు బహిష్కరించాలి"

ఉన్న పదిహేను మంది అధ్యాపకులు ఓ వలయంగా కాలేజీ గేటు ముందు దడి కట్టేశారు.

ఇంతలో పోలీసువారు 'యూఆర్ అండర్ అరెస్ట్' అన్నారు.

నినాదాలిచ్చుకుంటూ అధ్యాపకులు పోలీసు వ్యాన్ ఎక్కారు

ఇంటర్‌మీడియట్ పరీక్షల హాలుల వైపు సాగిపోతూ ప్రిన్సిపాల్.. ఇన్విజిలేటర్లు కాని ఇన్విజిలేటర్లు... ఇతర సిబ్బంది!

ఇంటర్ పరీక్షలకు ముందు అధ్యాపకుల సమ్మె మొదలైంది. అధ్యాపకులనుంచి జూనియర్ లెక్చరర్లను విడదీసి పరీక్షలు నడిపించేస్తోంది. కాంపోజిట్ కళాశాలల్లో ఇన్విజిలేటర్లు కాని వాళ్ళు ఇన్విజిలేటర్లు

అయ్యారు. పరీక్షలు నడిచిపోతూనే ఉన్నాయి... అధ్యాపకుల సమ్మె సాగిపోతూనే ఉంది.

భాస్కర్‌కు ఆశ్చర్యమేసింది...డెబ్బై మంది అధ్యాపకులకు అరెస్ట్ అయ్యింది పదిహేను మంది అందులో మా రామనాధం మాస్టార్ ముంది.

ఓ రోజు ధర్నా... ఓ రోజు పికెటింగ్...ఓ రోజు మౌన ప్రదర్శన... ఓ రోజు బ్రహ్మాండమైన ఊరేగింపు...

"అధ్యాపకుల ఐక్యత వర్ధిల్లాలి"

"అధ్యాపకుల న్యాయమైన కోర్కెలు సిద్ధించాలి"

"అధ్యాపకుల పట్ల అలసత్వ వైఖరిని ఖండించాలి"

అన్నింటిలోనూ రామనాధం మాస్టార్ ముందున్నారు. గంభీరమైన ఆయన కంఠస్వరం...ఊరేగింపు అగ్రభాగాన ఉంటూ నడిపించే ఆయన స్ఫురద్రూపం!

సాగిపోతున్న ఊరేగింపును భాస్కర్ ఆగి మరీ చూచేవాడు. కన్నుల పండువుగా. క్రమశిక్షణగా...నెమ్మదిగా... పది మంది దృష్టిని ఆకర్షించేలా సమస్యలేమిటో... వివరంగా చూపుతున్న ప్లేకార్డ్స్...పుర ప్రముఖుల్ని ఎన్‌లైట్ చేస్తూ చక్కని నినాదాలు!

సమ్మె మొదలై నెల రోజులు దాటింది. నెలాఖరులో సమ్మె మొదలు పెట్టడం చేత ఆ నెల పని చేసిన రోజులకు కూడా జీతం ఇవ్వలేదు. మరో నెల తిరిగిపోయింది. జీతం రాలేదు.

రెండు నెలలుగా జీతం రాకపోవడం చేత రామనాధం లాంటి మధ్య తరగతి మాస్టారికి మిగిలేది ఆర్థిక ఇబ్బందులే! కనీసావసరాలు తీర్చుకోవడమే కష్టమయ్యే పరిస్థితి! ట్యూషన్లు చెప్పడం...విద్యార్థుల నుంచి డబ్బు తీసుకోవడం ఆయన నైజానికి విరుద్ధం. రెండు నెలలు జీతాలు లేకపోయినా...స్థిమితంగా ఉండే అనేక మంది తోటి ఉపన్యాసకుల నుంచి వేరు చేసింది.

ఇంతలో పిడుగులాంటి వార్త!!

ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న అధ్యాపకుల దీక్ష అర్థాంతర విరమణ! ఆందోళనకరమైన ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా.... దీక్షను విరమింపచేసిన ప్రతిపక్షాలు సమయం కోసం కాచుకున్న అధికారం ఉద్యమాన్ని దెబ్బ తీసింది.

అన్ని కళాశాలలకూ వేసవి రాక ముందే వేసవి సెలవులు ప్రకటింపబడ్డాయి. ఆందోళన చేసే అధ్యాపకులు వెంటనే నిర్ణయించుకోవాలి... డ్యూటీలో చేరేదీ...లేనిదీ...

వేసవి సెలవులు ప్రారంభమయ్యే ముందు రోజు డ్యూటీలో చేరకపోతే...సమ్మర్ జీతంరాదు...మూలిగే నక్కమీద తాటికాయపడబోతోంది.

ఇప్పుడు అధికారానిదే పైచేయి..

ఆర్థిక పరిస్థితులతో అలమటించే రామనాధం మాస్టారు సమ్మె కొనసాగించడానికే ఓటు వేశారు.

సమ్మె మొదటి రోజు నుంచీ క్షణం తీరిక లేకుండా బ్యాచీలపై బ్యాచీలు నడిపి సక్సెస్‌ఫుల్‌గా ఇంటి వద్ద సిలబస్ పూర్తి చేసిన పరాత్పరరావు జాయినింగ్ రిపోర్టు ఇచ్చి మరీ మీటింగుకు హాజరయ్యాడు.

మెజారిటీ అభిప్రాయం ఆమోదింపబడింది... అందరూ డ్యూటీలో చేరిపోయారు. పరీక్షల తేదీలు ప్రకటింపబడ్డాయి...

రామనాధం మాస్టారి ఇల్లు కళకళలాడుతోంది. ఆయన గుమ్మం ఎక్కే విద్యార్థీ... దిగే విద్యార్థీ... నియమిత సమయాల్లో ఆయన విద్యాదానం చేయడం మొదలు పెట్టారు.



తనకూ ఉద్యోగం చెయ్యాలని కోరిక కలిగిన కమల గోముగా భర్తని అడిగింది.

"ఏమండి! ఒక్క భర్త సంపాదనతో రోజులు గడిచే కాలం కాదిది"

"ఆఁ?!"

ఛాప్టర్‌వైజ్ సిలబస్ విభజించి... ముఖ్యమైన విషయాలు అరటిపండు ఒలిచి నోటికందించేటట్లు ఉండే ఆయన విశ్లేషణ వింటే... విద్యార్థికి మరి చదవాల్సిన అవసరం లేదు. దానికితోడు పాత క్వశ్చన్ పేపర్లు ఆన్సర్ చేయించడం... ప్రశ్నకు సులభంగా, సమర్థవంతంగా జవాబు రాసే విధానం విద్యార్థుల ఉత్తీర్ణత సులభతరం చేస్తుంది.

పరీక్షలు మొదలయ్యాయి. రామనాథం మాస్టారి పేపర్ ఆన్సర్ చేయడం విద్యార్థులకు కరతలామలకమై పోయింది.

పరీక్షలైపోయాయి.

ఓ రోజు సాయం సంధ్యా సమయం...

రామనాథం మాస్టారి ఇంటి ముందు పాతిక మంది విద్యార్థులు...

"మాస్టారూ...మాస్టారూ..."

పరీక్షలైన తరువాత రామనాథం మాస్టారి ఇంటిలో ఏ అవాంఛనీయ సంఘటన జరగబోతుందోనన్న ఆందోళనతో వీధిలో కొచ్చిన జనం..

"నమస్తే.. మాస్టారూ!" అందరూ ముక్తకంఠంతో అన్నారు.

మాస్టారు ఇంటిముందు కాంపౌండ్‌లోకి రావడం ఆలస్యం.. ఓ విద్యార్థి డ్రాయింగ్ రూంలోంచి కుర్చీ తెచ్చివేశాడు.

ఇద్దరు సగౌరవంగా మాస్టారిని అందులో కూర్చోబెట్టారు.

వాళ్ళు తెచ్చిన గులాబీ, మల్లెదండలు ఆయన మెడనలంకరించాయి.

"ఏమిటయ్యా ఇదంతా.." అంతటి మాస్టారు సిగ్గుపడిపోయారు.

"ఏమీ లేదు మాస్టారూ.. మా కృతజ్ఞతలు తెలుపుకుందామని."

"మీరు చేసిన విద్యాదానానికి మా కృతజ్ఞత చెప్పుకుందామని."

"చంద్రునికో నూలుపోగులా.." విద్యార్థులన్నారు.

"అని ఈ విధంగా డబ్బు దుబారా చేయడం... తల్లిదండ్రులను కష్టపెట్టడం.." రామనాథం మాస్టారు అటకాయించారు.

"లేదు.. మాస్టారూ! సంతోష పూర్వకంగా.. హృదయపూర్వకంగా.. మా వాళ్ళే పంపించారు మాస్టారూ... ఈ చిన్న బహుమానం అందించమని!"

చిన్న జ్యూవలరీ బాక్స్ మాస్టారి కందించారు.

బాక్స్ తెరచి చూడగానే మాస్టారు దిగ్భ్రాంతి చెందారు.

'తాను చాలా తేలికగా అమ్మివేసినవి. మళ్ళీ జీవితంలో కొనలేనివి" అందులో మంగళకాంతులీనుతూ.. మనోహరంగా.. ముగ్ధమోహనంగా... తాను తన భార్య మెడ నుండి వేరుచేసిన మంగళసూత్రాల జత!

మాస్టారి కళ్ళు చెమ్మగిల్లాయి.

"మేము యేమిచ్చినా తీసుకోరని తెలుసు మాస్టారూ.!"

"మా నుంచి మీరు ఏమీ ఆశించరని కూడా తెలుసు మాస్టారూ."

"కేవలం మీ ధ్యేయం విద్యాదానమనీ మాకు తెలుసు మాస్టారూ."

"అందుకే ఉడుత భక్తిగా.. మీ ఆర్థిక పరిస్థితుల వల్ల మీరు కోల్పోయిన అమూల్య వస్తువు.. ఇవ్వాలనే సదుద్దేశంతో.."

"మీరు కాదనలేని ఈ చిన్ని కానుకను.. చిన్న మనసులతో.."

"మేము చేసిన సాహసానికి మమ్మల్ని క్షమిస్తారు కదూ.."

ఒక్కొక్క విద్యార్థే గద్గద స్వరంతో చెబుతుంటే...

ఇంట్లో నుండి అక్షింతల పళ్ళెం అందించిన ఆ 'అమ్మ' మాటలకు వాళ్ళు పులకించిపోయారు.

"వాళ్ళను ఆశీర్వదించండి."

ముకుళిత హస్తాలతో ఒక్కొక్కరుగా మాస్టారిముందు నిలబడి తలవంచితే ఆయన అక్షింతలు అందుకున్నారు.

"సమస్త సన్మంగళాని భవంతు.." హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నారు. ఆనంద బాష్పాలు తుడుచుకోకుండానే.

ఇంటి ముందు కాంపౌండ్‌లో ఏం జరుగుతుందో చూద్దామని వచ్చిన వారందరి చెమ్మగిల్లిన కళ్ళు.

ఓ స్వీట్ మాస్టారి నోటికందించిదొకరు.

గులాబీ రేకులను ఆయన మీద విరజిమ్మిందొకరు.

అత్తరు.. పన్నీరు చిలకరించిందొకరు..

రామనాథం మాస్టారికి సన్మానం జరుగుతోంది. ఆకాశమే పందిరిగా, భూదేవే వేదికగా, సంధ్యారుణకాంతులే నవ్వవర్ణ దీపాలుగా.. ఆ వీధి జనాభా.. పిల్లా, జెల్లా సభికులుగా..

ఆయనకు అధికారుల అభయహస్తం లేదు.

ఆయనకు మేనేజ్‌మెంట్ మెహర్బానీ లేదు.

ఆయనకు పురప్రముఖుల మధ్య ప్రాముఖ్యత లేదు.

ఆయనకు ఉన్నదల్లా... తను నమ్ముకున్న వృత్తిమీద అచంచలమైన భక్తి, విశ్వాసం, నిజాయితీ, ఏకాగ్రత!

అందుకే.. ఆయనకు అపురూపమైన సన్మానం జరుగుతోంది!

భావి భారత పౌర నిర్మాణ మహాయజ్ఞంలో సమిధగా మారిన ఆయనకు అనమోపమైన సన్మానం జరుగుతోంది!!

దూరంగా దేవాలయం మైకులోంచి వినిపిస్తోంది.

"మాతృదేవోభవ... పితృదేవోభవ... ఆచార్య దేవోభవ.."

అంకితం: రామనాథం మాస్టారులాంటి అధ్యాపకులందరికీ..

భక్తి ప్రపత్తులతో...!